# నమస్తే తెలంగాణ
## వరంగల్ హనుమకొండ

5 | సోమవారం 8 ఏప్రిల్ 2024 | WARANGAL HANUMAKONDA




ఐనవోలు: పెద్దపట్నం తొక్కుతున్న భక్తులు

## కనుల పండువగా మల్లన్న కల్యాణం

ప్రత్యేక ఆకర్షణగా పెద్దపట్నం



ఐనవోలు: ఆలయ ఆవరణలో వేసిన పెద్దపట్నం

ఐనవోలు, ఏప్రిల్ 7 : ఫాల్గుణ మాసం చివరి ఆదివారం సందర్భంగా బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మ సమేత ఐనవోలు మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలిరాగా, మల్లన్న నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్‌శర్మ, వేదపండితుడు గట్టు పురోషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, ఒగ్గు పూజారులు మజ్జిగ మహేందర్, మజ్జిగ మల్లయ్య, వెంకట నారాయణ పూజలు చేశారు. ఈవో నాగేశ్వర్‌రావు, ఆలయ అధికారులు పాల్గొన్నారు. కల్యాణంలో భాగంగా రాష్ట్రంలోనే అతి పెద్ద పెద్దపట్నం వేశారు. 10గంటల పాటు శ్రమించి 50 ఫీట్ల పొడవు, వెడల్పుతో అందంగా తీర్చిద్దిదారు. పర్వతగిరి సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్సైలు అనిల్‌కుమార్, వెంకన్న బందోబస్తు నిర్వహించారు.

---

## గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు కసరత్తు



**తుది ఓటరు జాబితా విడుదల**

**నియోజకవర్గ పట్టభద్ర ఓటర్లు 4,61,806**

**ఏ క్షణంలో షెడ్యూల్ వచ్చినా ఎన్నికల నిర్వహణకు సిద్ధం**

హనుమకొండ, ఏప్రిల్ 7: ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికలకు ఆయా జిల్లాల అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు. ఏ క్షణంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలైనా ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం తుది ఓటర్ల జాబితాను ఈ నెల 4న ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ జాబితా ప్రకారం నియోజకవర్గం పరిధిలో మొత్తం 4,61,806 పట్టభద్ర ఓటర్లు ఉన్నారు. జనగామ ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొంది ఎమ్మెల్సీగా రాజీనామా చేయడంతో మళ్లీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కాగా, 2021లో నిర్వహించిన గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఓటరు జాబితాలోని ఓటర్ల కంటే తాజాగా విడుదల చేసిన జాబితాలో ఓటర్లు తగ్గినట్లు సమాచారం.

### పట్టభద్ర ఓటర్లు 4,61,806

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గంలో ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్స్ ఓటర్లు 4,61,806 మంది ఉన్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు అర్హులుగా నవంబర్ 1 2023 వరకు కొత్త ఓటరు నమోదు కార్యక్రమం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా స్వీకరించి జాబితా రూపొందించారు. ఈ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం అనంతరం తుది ఓటరు జాబితాను గత గురువారం విడుదల చేసి రాజకీయ పార్టీల నాయకులకు సీడీలను అందజేశారు. ఈ జాబితా ప్రకారం నియోజకవర్గంలోని 600 పోలింగ్ స్టేషన్ల పరిధిలో మొత్తం 4,61,806 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 2,87,007 కాగా, మహిళలు 1,74,794, ట్రాన్స్‌జెండర్స్(టీజీ) ఐదుగురు ఉన్నారు.

**జిల్లాల వారీగా ఓటర్ల వివరాలు**

| జిల్లా | పోలింగ్‌స్టేషన్లు | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|---|
| సిద్దిపేట | 05 | 3118 | 1553 | -- | 4671 |
| జనగామ | 27 | 14862 | 8457 | 01 | 23320 |
| హనుమకొండ | 67 | 25608 | 17875 | -- | 43483 |
| వరంగల్ | 59 | 26907 | 16687 | -- | 43594 |
| మహబూబాబాద్ | 36 | 22842 | 11917 | -- | 34759 |
| ములుగు | 17 | 6558 | 3679 | -- | 10237 |
| భూపాలపల్లి | 16 | 7956 | 4504 | -- | 12460 |
| భద్రాద్రి | 55 | 22486 | 17412 | -- | 39898 |
| ఖమ్మం | 115 | 50517 | 33085 | 04 | 83606 |
| భువనగిరి | 37 | 20740 | 13186 | -- | 33926 |
| సూర్యాపేట | 71 | 34043 | 17250 | -- | 51293 |
| నల్లగొండ | 95 | 51370 | 29189 | -- | 80539 |
| మొత్తం | 600 | 2,87,007 | 1,74,794 | 05 | 4,61,806 |

---

## రేటు రాక స్టోరేజీ లేక..

**25 శీతల గిడ్డంగులు ఫుల్**

**దక్కని గిట్టుబాటు ధరలు.. పట్టించుకోని అధికారులు**

**ఇప్పటి వరకు 7లక్షల క్వింటాళ్ల మిర్చి కొనుగోలు**

**ఆందోళనలో మిర్చి రైతులు.. కోల్డ్ స్టోరేజీల్లో వ్యాపారులదే హవా**



ఆరుగాలం ఎండనక వాననక కష్టపడి పంట పండించిన మిర్చి రైతుకు మార్కెట్లో నిరాశే మిగులుతోంది. అమ్మబోతే అడవి కొనబోతే కొరివిలా పరిస్థితి నెలకొంది. చేతికొచ్చిన మిర్చిని మార్కెట్‌లో అమ్ముకుందామంటే ధర లేదు.. ధరలు పెరిగేదాక ఆగుదామంటే నిల్వ చేసుకునేందుకు కోల్డు స్టోరేజీల్లో జాగలేక తక్కువ రేటుకే అమ్ముకోవాల్సి వస్తాంది. ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో 25 శీతల గిడ్డంగులు ఉండగా, వీటిల్లో ఎక్కువగా వ్యాపారులదే హవా నడుస్తోంది. ఆశించిన ధర దక్కక.. నిల్వ చేసుకునే పరిస్థితి లేక రైతాంగం ఆందోళన చెందుతోంది.

– కాశీబుగ్గ, ఏప్రిల్ 7



మిర్చి దిగుబడి ఈ సంవత్సరం అధికంగా రావడంతో పాటు పక్క రాష్ట్రాల్లో కూడా పంట బాగా పండింది. దీనికి తోడు విదేశాలకు మిర్చి ఎగుమతుల డిమాండ్ తగ్గడంతో ధరలు పడిపోయినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. పెద్ద ఎత్తున వరంగల్ మార్కెట్‌కు మిర్చి బస్తాలు వస్తుండడంతో స్థానిక రైతుల మిర్చికి చాలా వరకు డిమాండ్ తగ్గింది. దీంతో పెట్టుబడులు కుడా వచ్చేటట్లు లేవని ఆవేదన చెందుతున్నారు. చాలా మంది రైతులు ధరలు పెరిగితేనే అమ్ముకునేందుకు మొగ్గు చూపుతుండగా, మరికొందరు తప్పనిసరి తమ అవసరానికి అగ్గువకే విక్రయించాల్సి వస్తున్నది. కొందరు రైతులు ఆశాజనకంగా ఉంటే అమ్ముకుందామని కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకుందామను కున్నా అక్కడా స్థలం లేక పోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో పడిపోయారు. మిర్చి దిగుబడి పెరగడం, డిమాండ్ తగ్గడంతో ధరలు క్రమంగా తగ్గుతున్నాయి. ధర లేక, మిర్చిని నిల్వ చేసుకునే పరిస్థితి లేక తమ సరుకును అగ్గువ సగ్గువకు అమ్ముకోవాల్సి వస్తున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### 25 కోల్డ్ స్టోరేజీలు ఫుల్

ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో 25 కోల్డ్ స్టోరేజీలు ఉన్నాయి. ఒక్కొక్కటి 80 వేల బస్తాల కెపాసిటీ నుంచి లక్షా 20వేల వరకు ఉంది. మొత్తం కెపాసిటీ 27లక్షల 5వేల బస్తాలు(లక్షా 21వేల 725 మెట్రిక్ టన్నులు) ఉంది. ప్రస్తుతం 22లక్షల 28వేల 149 బస్తాల మిర్చి, పసుపు 2లక్షల 69వేల724 బస్తాలు, ఇతర పొడర్లు 91వేల బస్తాలు (మొత్తం 25లక్ష 90వేల 92 బస్తాలు, లక్షా16వేల554 మెట్రిక్ టన్నులు) ఉన్నాయి. ఇంకా లక్షా 15వేల బస్తాల (5వేల 171 మెట్రిక్ టన్నులు) స్థలం ఖాళీగా ఉంది. ఈ సీజన్ డిసెంబర్‌లో ప్రారంభం కాగా, ఇప్పటి వరకు సుమారు 8లక్షల క్వింటాళ్ల మిర్చి(20లక్షల బస్తాలు) మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరిగినట్లు అధికారులు తెలిపారు. కొందరు రైతులు ధరలు నచ్చక కోల్డ్ స్టోరేజీలో మిర్చి బస్తాలు నిల్వ చేసుకున్నారని, మరో రెండు రోజుల్లో పూర్తిగా నిండిపోతాయని చెప్పారు. బయట రాష్ట్రాలకు ఎగుమతి అయితే స్టోరేజీలు ఖాళీ అయ్యే అవకాశం ఉందన్నారు.

### ఆరంభ శూరత్వం..

తక్కువ బస్తాలు వచ్చిన క్రమంలో ధరలు ఎక్కువగా చెల్లిస్తూ మిర్చి కొనడం వ్యవసాయ మార్కెట్లో ఆనవాయితీగా వస్తోంది. సరుకు ఎక్కువగా వస్తుంటే వ్యాపారులు ధరలు తగ్గిస్తూ దగా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎనుమాముల మార్కెట్‌లో మార్కెటింగ్ శాఖ అధికారులు దృష్టి పెట్టకపోవడంతో దళారులు అందినంత దోచుకుంటున్నారనే విమర్శలున్నాయి.



---



నిట్‌లో స్ప్రింగ్ స్ప్రీ వేడుకల్లో ఆదివారం చివరి రోజూ అదే జోరు కొనసాగింది. మూడు రోజుల కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా విద్యార్థులు ఉత్సాహంగా పలు ఈవెంట్లను ప్రదర్శించారు. ఇందులో పార్టిసిపేట్ చేసిన కొన్ని ప్రదర్శనలు ప్రశంసలందుకున్నాయి. నటుడు నవదీప్‌తో విద్యార్థులు ఇంటరాక్ట య్యారు. వారు అడిగిన ప్రశ్నలకు హీరో హుషారుగా సమాధానం చెప్పారు. సీతారామం దర్శకుడు హను రాఘవపూడి స్టూడెంట్స్‌తో తన అనుభవాలను పంచుకున్నారు. విద్యార్థులే నిర్వాహకులుగా జరుపుకున్న సాంస్కృతిక మహోత్సవం వారిలో నూతనోత్తేజాన్ని నింపింది.

– హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 7



విద్యార్థులతో హీరో నవదీప్

## చివరి రోజూ అదే జోరు

**నిట్‌లో మూడో రోజు పలు ఈవెంట్ల ప్రదర్శన**

**హీరో నవదీప్‌తో విద్యార్థుల ఇంటరాక్ట్.. ముగిసిన వసంతోత్సవం**

నిట్‌లో స్ప్రింగ్ స్ప్రీ వేడుకలు ఘనంగా ముగిశాయి. కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా విద్యార్థులు పలు రకాల ఈవెంట్లను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. నుక్కడ్ నాటక్, డైరెక్టర్స్ కట్, కొరియో నైట్ వంటి ఈవెంట్లు పార్టిసిపెంట్ల నుంచి గొప్ప ప్రశంసలను పొందాయి. స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసాచార్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంలో సహకరించిన అన్ని బృందాలు, వక్తలు, మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు. స్ప్రింగ్ స్ప్రీ–24ను గ్రాండ్ సక్సెస్ చేయడానికి వివిధ టీమ్‌లు అందించిన సహాయానికి కోఆర్డినేటర్లు, చందర్, సాహిత్, తనీష్, ప్రశాంత్ ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం స్కావెంజర్ హంట్, కరొకే, వాట్స్ డిఫరెంట్, సోలో ఐడల్, ట్రెజర్ హంట్, మేళా తదితర ఈవెంట్లు ప్రదర్శించారు.

### ప్రపంచాన్ని చుట్టిరావడానికి ఇష్టపడతా: హీరో నవదీప్

తాను ప్రపంచంలోని వివిధ ప్రదేశాలను సందర్శించడానికి, అన్వేషించడానికి ఇష్టపడతా. స్కావెంజర్, ట్రెజర్ హంట్ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించా. విద్యార్థులు కూడా సాధ్యమైనంత వరకు ట్రావెల్ చేయాలి. కరోనా లాక్‌డౌన్ సమయంలో తాను నవదీప్ 2.0గా మారిపోయి తన జీవితం గురించి ఆలోచించా. నా జీవితంలో అతి పెద్ద విజయాల్లో ఒకటి బిగ్ బాస్ ఇంట్లోకి వైల్డ్‌కార్డ్ ప్రవేశం. అక్కడ నా జీవితం, అవకాశాలు రూపాంతరం చెందాయి.






దర్శకుడు హనురాఘవపూడి

### 19 ఏళ్లకే చిత్ర పరిశ్రమలోకి: దర్శకుడు హనురాఘవపూడి

19 ఏళ్ల వయస్సులో చిత్ర పరిశ్రమలోకి వచ్చా. నిరంతరం ఎన్నో అడ్డంకులను ఎదుర్కొన్నా. నేను రాసిన కథలు ప్రధానంగా ప్రేమ ఆధారంగా ఉంటాయి. ఫిల్మ్ మేకింగ్‌లో ప్రధాన సవాలు ఎడిటింగ్. సీతారామం షూటింగ్ సమయంలో 11 రోజుల పాటు ఇబ్బందులు ఎదురయ్యాయి. కొన్ని సార్లు మైనస్ ఉష్ణోగ్రత ప్రధాన సమస్య.



ఇంటరాక్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

---

## యువతిని మోసం చేసిన నకిలీ సీఐ

సుబేదారి, ఏప్రిల్ 7 : పోలీసు డిపార్ట్‌మెంట్‌లో సీఐగా పనిచేస్తున్నానని చెప్పి యువతిని మోసం చేసిన ఘటన హనుమకొండ పోలీసు స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన మామిడి వెంకటేశ్వర్ కొద్ది నెలల క్రితం హనుమకొండలో ప్రైవేట్ దవాఖానలో శాయంపేట మండలానికి చెందిన యువతిని పరిచయం చేసుకున్నాడు. తాను పోలీసు ఇన్‌స్పెక్టర్ అని నమ్మించి 50 గ్రాముల గోల్డ్, రూ.2లక్షలు తీసుకున్నాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## సబ్ రిజిస్ట్రార్‌లో 'బ్రోకర్' దందా!

**ములుగు కార్యాలయంలో పనికో రేటు**

**సిండికేట్‌గా మారిన డాక్యుమెంట్ రైటర్లు**

**ఏ పని కావాలన్నా వారిని కలవాల్సిందే..**

**అధికారులు, సిబ్బందికి వాటాలు**

**అటెండర్ నుంచి పైస్థాయి వరకు ఇదే తంతు**

ములుగు, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : ఆ కార్యాలయానికి ప్రజలు నేరుగా వెళ్తే ఏ పనీ జరుగదు.. ఏ చిన్న పనైనా బ్రోకర్లను కలవాల్సిందే.. వారు చెప్తేనే అటెండర్ నుంచి అధికారుల వరకు పనిచేస్తారు. ఇదీ ములుగు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజూ జరుగుతున్న తంతు. నిన్న మొన్నటి వరకు ఎవరికి వారుగానే ఉన్న డాక్యుమెంట్ రైటర్లు ప్రస్తుతం సిండికేట్‌గా మారారు. పనికో రేటు ఫిక్స్ చేసి, కార్యాలయానికి వచ్చే ప్రజల నుంచి ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారు. అనంతరం అధికారులు, సిబ్బందితో పనులు చేయించి వాటాలు పంచుతున్నారు. ఏ చిన్న పనైనా పెద్ద హడావుడి చేస్తూ అందినకాడికి దోచుకోడం నిత్యం జరుగుతున్నది. దందా బాగుండడంతో డాక్యుమెంట్ రైటర్లు కార్యాలయం చుట్టూ దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. భూమి, మ్యారేజ్ రిజిస్ట్రేషన్ కోసం నేరుగా కార్యాలయానికి వెళ్లిన వారికి బ్రోకర్లను ఆశ్రయించాలని సిబ్బంది సూచిస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా మ్యారేజ్ రిజిస్ట్రేషన్ కోసం స్రవంతి–రాజేశ్ దంపతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని కార్యాలయానికి రాగా అటెండర్ డాక్యుమెంట్ రైటర్‌ను కలువాలని సూచించారు. ఎదురుగా ఉన్న డాక్యుమెంట్ రైటర్ వద్దకు వెళ్లి కలువగా రూ.700 ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఎందుకివ్వాలని వారు ప్రశ్నించగా కార్యాలయ ఖర్చుల నిమిత్తం అధికారులు తీసుకొమ్మన్నారని, ఇక్కడ ఇదే పద్ధతి ఉంటుందని చెప్పడంతో వారు డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకొని వెళ్లాల్సి వచ్చింది. అనంతరం ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో జిల్లా వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి చర్చనీయాంశంగా మారింది.

### బ్రోకర్లు చెప్తేనే పనిచేస్తరు

ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకొని అన్ని పత్రాలతో ప్రజలు వస్తున్నప్పటికీ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది మాత్రం బ్రోకర్లు సూచించిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారు. నేరుగా వచ్చిన వారిని గంటల తరబడి కూర్చోబెట్టడంతో చివరకు వారు సైతం బ్రోకర్లను ఆశ్రయించాల్సి వస్తున్నది. వివిధ రాజకీయ పార్టీల్లో కీలక పదవుల్లో ఉంటూనే డాక్యుమెంట్ రైటర్లుగా చలామణి అవుతూ పైసలు దండుకుంటున్నారు. అటెండర్లు సైతం కార్యాలయం ముద్ర వేస్తే రూ .500 నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తున్నారు. డాక్యుమెంట్ నంబర్లను రిజిస్టర్‌లో నమోదు చేయాల్సిన అటెండర్లు పెన్సిల్‌తో సంబంధిత డాక్యుమెంట్ రైటర్ పేరు, ఎన్ని డాక్యుమెంట్లు నమోదయ్యాయో రాసుకుంటున్నారు. కార్యాలయం వేళలు ముగిసిన తర్వాత అధికారులు, సిబ్బంది వాటాలు తీసుకొని వెళ్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్ల దందాకు అడ్డుకట్ట వేయకుంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉంటుంది. ప్రజలే భూమి, మ్యారేజ్ రిజిస్ట్రేషన్ల కోసం నేరుగా కార్యాలయానికి వచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




ములుగులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం